క్లుప్తంగా

పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

గన్నవరం:మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు గురువారం వాసవిక్లబ్ గన్నవరం మిత్ర ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ-2 ఎం. కమల చేతుల మీదుగా వీటిని పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రాలు మెరుగైన విద్య, వైద్యం, భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. వాసవిక్లబ్ అధ్యక్షులు కందగడ్డల నాగరాము, కార్యదర్శి మడుపల్లి విద్యాసాగర్, కోశాధికారి తిరువీధుల పృధ్వీరాజ్, సభ్యులు మనోజ్‌కుమార్, బూరగడ్డ సాయికృష్ణ, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం



పెనమలూరు: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థినికి నాయీబ్రాహ్మణ సంఘం సత్కరించింది. పోరంకిలో గురువారం జరిగిన కార్యక్రమంలో పెదపులిపాక గ్రామానికి చెందిన అద్దేపల్లి ప్రణీత పదిలో 584/600 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా తెలుగు నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు విద్యార్థినికి శాలువా కప్పి రూ.6 వేలు నగదు అందచేశారు. భవిష్యత్తులో కూడా బాగా చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నేతలు చాగంటిపాటి శివరామకృష్ణ, తెన్నేటి ప్రకాష్, చాగంటిపాటి చంద్రశేఖర్, మారుతి సురేష్‌బాబు, కుందేటి శివరామకృష్ణ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో పేద కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. గ్రామంలో గత ప్రభుత్వంలో వలంటీరుగా సేవలు అందించిన సునీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని గురువారం పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి నేతృత్వంలో పార్టీ శ్రేణులు పరామర్శించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి వితరణతో రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నున్న శ్రీనివాస్, గుండె ఫణీంద్ర పాల్గొన్నారు.

జాతీయ రహదారి ఆక్రమిస్తే చర్యలు

పెనమలూరు:విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిని వ్యాపారులు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పోరంకి నుంచి పెనమలూరు సెంటర్ వరకు గురువారం బందరు రోడ్డు ఆక్రమణలు పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ వ్యాపారులు జాతీయ రహదారి మార్జిన్‌లు ఆక్రమించటం వలన తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఆక్రమణల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పథకాల అమలులో కూటమి విఫలం

గన్నవరం: సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ నాయకులు తెలిపారు. చింతపల్లి పాపారావు స్మారక భవనంలో గురువారం సీపీఐ 25వ నియోజకవర్గ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో గన్నవరం ప్రాంతానికి చెందిన కమ్యూనిస్టులు ఎక్కువ మంది అమరులయ్యారని చెప్పారు. అమరుల త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తించి వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యలపై ఉద్యమించాలని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. జూలై 8, 9 తేదీల్లో గన్నవరంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నాయకులు పెద్దు వెంకటరత్నం, వాసుదేవరావు, కాట్రగడ్డ జోషి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



పెనమలూరు:గంగూరు గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ అన్నారు. గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. గృహాల వద్ద తడి చెత్త పొడి చెత్త సేకరణను పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని తెలిపారు. డ్రెయినేజీలలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులతో పనులు సక్రమంగా చేయించి క్లీన్ గంగూరుగా ఉంచాలన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టంగా ఖరీఫ్ సాగు!

- అరకొరగా సబ్సిడీ విత్తనాలు
- అందుబాటులో లేని ఎరువులు
- కాలువల పూడిక తీత నిల్
- ఆర్థిక సాయం వాయిదా
- కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం



నాట్లకు సిద్ధంగా ఉన్న వరి నారు

పెనమలూరు:ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కష్టంగా సాగేలా కన్పిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా విస్మరించింది. రైతులకు ఏ విధమైన సహకారం అందించడం లేదు. సీజన్ ప్రారంభంలోనే రైతులు అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో రైతుల కష్టాలు ఎలా తీరుతాయన్న ప్రశ్నకు సమాధానం కనబడటం లేదు. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 7 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. సీజన్ ప్రారంభంలో రైతులకు ప్రభుత్వ పరంగా మద్దతు లభించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం రైతులకు ఏమాత్రం తమ వంతు సహాయ సహకారాలు అందించటం లేదని రైతులు వా పోతున్నారు.

అరకొర సబ్సిడీ విత్తనాలు....

మండల పరిధిలో ఖరీఫ్‌లో దాదాపు ఏడు వేల ఎకరాల సాగు జరుగుతుండగా ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలు నామమమాత్రంగానే ఇచ్చారు. రైతులు ఎంటీయు 1061, 1318 రకం విత్తనాలతో సాగు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం 1061 రకం 100 క్వింటాళ్లు, 1318 రకం 200 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు మాత్రమే ఇచ్చింది. అంటే కేవలం వెయ్యి ఎకరాలకు మాత్రమే సబ్సిడీ వరి విత్తనాలు ఇచ్చారు. మిగితా ఆరు వేల ఎకరాలకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వలేదు. దీంతో రైతులు అధిక ధరలకు విత్తనాలు ఎరువుల దుకాణాల్లో, సహచర రైతుల వద్ద కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన విత్తనాలకు 30 కేజీల బస్తా రూ.1110 ధర ఉంది. బహిరంగ మార్కెట్‌లో ధర రూ. 1300 నుంచి 1500 వరకు ఉంది. రైతులు అధిక ధరలకు వరి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

ఎరువులు కొరత..యూరియా వివాదం....

ఖరీఫ్ సాగులో భాగంగా రైతులు నారుమళ్లు వేశారు. అయితే ప్రస్తుతం ఎరువులు అందుబాటులో లేకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రైతులకు కావాల్సిన డీఏపీ ఎరువులు రైతులకు ఎక్కాడా దొరకటం లేదు. ఇక యూరియా స్టాకు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వం ప్రకటించిన యూరియా ధర హోల్ సేల్ ధరలకు విక్రయిస్తే తమకు ఏమి మిగలదని ఎరువుల దుకాణాల యజమానులు ప్రశ్నిస్తున్నారు. రవాణా, లోడింగ్ ధరల భారం పడుతున్నందున ఖర్చులు లేకుండా యూరియా సరఫరా చేయాలని ఎరువుల వ్యాపారుల డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో యూరియా వ్యవహారం వివాదంగా ఉంది. దీంతో ఎరువులు చాలినంత స్టాకు పెట్టడంలో వెనకడుగు వేయటంతో దీని ప్రభావం రైతులపై పడింది. దుక్కి దున్ని నాట్లు వేసిన సమయంలో ఎరువులు ఎలా అందుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పెట్టుబడి సాయం లేదు....

రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవటంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి అన్నదాత సుఖీభవ ఇస్తామని హడావుడి చేసిన అధికారులు ఇప్పటివరకు ఆర్థిక సాయం అందించలేదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు కూడా పూర్తిగా ఇవ్వలేదు. కౌలు రైతులకు బ్యాంకు రుణాల ఇచ్చే విషయంలో ప్రభుత్వం నేటికి ప్రత్యేక చర్యలు తీసుకోలేదు. రైతులు, కౌలు రైతులు నేడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో ఖరీఫ్ సాగుకు అప్పులు చేయాల్సిన దిస్థితి ఏర్పడింది.

అవసాన దశలో సాగు కాలువలు....

ఖరీఫ్ సీజన్ మొదలైనా సాగు కాలువలు మాత్రం అవసాన దశలో ఉన్నాయి. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తీత చేపట్టలేదు. కాలువల్లో సాగునీరు కూడా వదలలేదు. నారుమళ్లకు నీరు అంతంత మాత్రంగానే అందుతుంది. బోర్లకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుంది. వరుణ దేవుడు రైతులను కనికరించక పోవటంతో సాగు నీరు సమస్య ఉంది. ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి. డీఏపీ, యూరియా ప్రభుత్వ ధరల ప్రకారమే విక్రయించాలి. ఎరువులు లేక పోతే సాగు సక్రమంగా జరగదు.

-షూక్.షంషుద్దీన్, రైతు, గంగూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి. ప్రధానంగా పంట రుణాలు వడ్డీ లేకుండా ఇవ్వాలి. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి.

-వణుకూరు కోటయ్య, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్, వణుకూరు.



పొలం దమ్ము చేయటానికి ఏర్పాట్లు చేసిన దృశ్యం



గుర్రపు డెక్కతో పూడిపోయిన బందరు కాలువ

రూ.20 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో డ్రెయినేజీ పనులు సాగుతున్నాయి. రంగా బొమ్మ సెంటర్ నుంచి సప్తగిరి బ్యాంక్ వరకు 115 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్నట్లు గ్రామీణనీటి సరఫరా విభాగం ఏఈ శ్వేత తెలిపారు. డ్రెయినేజీ నిర్మిస్తున్న ప్రాంతంలో వాగు ప్రవహించేది. కొండలపై కురిసిన వర్షం నీరు వాగులా ప్రవహించి జంగమవాని చెరువులోకి వెళ్లేది. వాగు ఆవలి వైపు నివసించే కుటుంబాల వారు వాగు పై తాటిబొత్తలతో సొంతగా నిర్మించుకున్న సబ్‌వే ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. దాదాపు 40 సంవత్సరాల పాటు ఆ విధంగా బాధలు పడుతున్న ప్రజల విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీ డ్రెయినేజీ కాల్వ నిర్మించడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్టయ్యిందని స్థానికులు చెబుతున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం నుంచి హైస్కూల్ వరకు రోడ్డుకు ఎడమ వైపు ఆక్రమణలు పెరిగి తరుచుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం:విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి. హరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అజ్జంపూడి, బుద్దవరం, బూతిమిల్లిపాడు, బుద్దవరం హౌసింగ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యర్థ జలాల నిర్వహణకు మ్యాజిక్ సోక్ పిట్స్ నిర్మించాలి



పిట్స్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర వాటర్ కమిషన్ బృందం సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థ జలాల నిర్వహణ సమస్యను పరిష్కరించేందుకు ప్రతి ఇంటికి మ్యాజిక్ సోక్ పిట్స్ నిర్మించుకోవాలని ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీ రెడ్డి చెప్పారు. బాపులపాడు మండలం మడిచర్లలో నిర్మిస్తున్న మ్యాజిక్ సోక్ పిట్స్‌ను గురువారం కేంద్ర వాటర్ కమిషన్ (ఢిల్లీ) బృందం సభ్యులు ఎ.స్వామి నాయుడు నేతృత్వంలో పరిశీలించారు. వ్యర్థ జలాల నిర్వహణకు సరైన ప్రణాళిక, మౌలిక సదుపాయాలు లేకపోవటంతో అపరిశుభ్ర పరిసరాలు ఏర్పడుతున్నాయని, తద్వారా అనారోగ్య సమస్యలు, అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని చెప్పారు. వంట గది, మరుగుదొడ్డి నుంచి వచ్చే వ్యర్థజలాలు రోడ్లపైకి, బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టకుండా మ్యాజిక్ సోక్ పిట్స్‌లోకి తరలించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు. బాపులపాడు ఏపీవోఎస్ అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి చాగంటిపాటి ఆంజనేయులు, జూనియర్ ఇంజినీర్ కె.నాగరాజు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలకు మోటారు వితరణ



వాటర్ మోటార్ అందజేస్తున్న మద్దినేని

గన్నవరం:స్థానిక చింతలపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సదుపాయం నిమిత్తం ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు కొత్త మోటార్‌ను బహుకరించారు. ఈ మేరకు గురువారం పాఠశాల హెచ్‌ఎం పి. వెంకటవరప్రసాద్‌కు రూ. 10,600 విలువ కలిగిన మోటార్, పైపులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలను పునఃప్రారంభించినప్పటి నుంచి మోటార్ పనిచేయకపోవడం వల్ల ఆర్‌ఓ ప్లాంట్ వినియోగంలో లేక విద్యార్థులు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై స్థానిక ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతులకు గురైన పాత మోటార్ స్థానంలో కొత్తది అందజేసినట్లు తెలిపారు. వెంటనే మోటార్‌ను అమర్చి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎంపీటీసీ సభ్యులకు ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలియజేసింది. తొలుత ఈ పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం కుమారిని సత్కరించారు. విద్యా కమిటీ చైర్మన్ రాజశేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమిషనర్ సేవలు అభినందనీయం



కమిషనర్ పాయసం వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న తహసీల్దార్, చైర్మన్

ఉయ్యూరు రూరల్: నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయబోతున్న కమిషనర్‌ను సన్మానించారు. విధి నిర్వహణలో మచ్చలేని అధికారిగా వెంకటేశ్వరరావు సేవలు అందించారని కొనియాడారు. పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఎంపీడీవో శేషగిరిరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంకిపాడు: ప్రమాదవశాత్తూ వన్నేరు డ్రెయినులో పడి గాయపడ్డ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని మంతెన గ్రామానికి చెందిన కొలకలూరి ప్రేమ్‌కుమార్ (31) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. గేదెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 17వ తేదీన గేదెలు మేపుతూ ఉండగా ఒక్కసారిగా ఫిట్స్ రావటంతో వన్నేరు కట్టపై దొర్లి వన్నేరు డ్రెయినులో పడిపోయాడు. అక్కడే ఉన్న ఆయన తల్లి చూసి తన చిన్న కుమారుడిని పిలిచి డ్రెయినులో పడ్డ ప్రేమ్‌కుమార్‌ను బయటకు లాగారు. 108 అంబులెన్సులో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. మృతుడు అవివాహితుడు.

నట్టల నివారణ మందు పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్:గొర్రెలు, మేకల్లో నట్టల వ్యాధి నివారణకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మందుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బాపులపాడు మండలం రేమల్లేలో పశుసంవర్ధక శాఖ అధికారులు గురువారం మేకలు, గొర్రెల మందల వద్దకే నేరుగా వెళ్లి నట్టల నివారణ మందును అందజేశారు. రేమల్లేలో 386 గొర్రెలు, 126 మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు పశుగణ సహాయకులు కె.రామకృష్ణ తెలిపారు.

వృద్ధులకు రేషన్ బియ్యం పంపిణీ

పెనమలూరు:మండల పరిధిలో తెల్లరేషన్‌కార్డు ఉన్న వృద్ధులకు ఇంటి వద్ద రేషన్‌పంపిణీ కార్యక్రమం రెవెన్యూ అధికారులు చేపట్టారు. మండలంలో తెల్లరేషన్‌కార్డు ఉండి రేషన్ షాపుకు రాని వృద్ధులు, వికలాంగులు 4051 మంది ఉండగా గురువారం మొదటి రోజు 824 మందికి బియ్యం పంపిణీ చేశామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు రేషన్‌బియ్యం డీలర్లు ఇంటికి వచ్చి అందచేస్తొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలి



గన్నవరంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న జడ్జిలు, న్యాయవాదులు



ఉయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కంకిపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ వి.భావనారాయణ, సీఐ జె.మురళీకృష్ణ

గన్నవరం:మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్‌పర్సన్, సబ్ కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కోర్టు నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అరుణశ్రీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసై యువత భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. సమాజానికి హానికరమైన మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రజలందరూ కలిసిరావాలని కోరారు. మరో జడ్జి గాయత్రి, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఏపీ దిశగా ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, తహసీల్దారు కె.వెంకటశివయ్య, సీఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ఉయ్యూరులో గురువారం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వీరమ్మతల్లి ఆలయం నుంచి ప్రధాన సెంటరు వరకూ అవగాహనా ర్యాలీ చేపట్టారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ రామారావు, ఎస్‌ఐ విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంఈఓ సుధారాణి, ఎంపీడీఓ శేషగిరిరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కలవపాముల గ్రామంలో రూరల్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఐ చట్టాలపై అవగాహన కల్పించారు.

మత్తుకు బానిసలు కావొద్దు

కంకిపాడు: మత్తుకు బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని తహసీల్దార్ వి.భావనారాయణ, సీఐ జె.మురళీకృష్ణ హితవుపలికారు. కంకిపాడు పట్టణంలో నేషనల్ యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకుని గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలంటూ పట్టణంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ, సీఐ జె.మురళీకృష్ణ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో విచక్షణ కోల్పోతారని చెప్పారు. ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. మత్తు, గంజాయికి దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో యువత మెలగాలని సూచించారు. అదనపు ఎస్‌ఐ తాతాచార్యులు, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ బేబీ సుకన్య, సూపర్‌వైజర్ అన్నామణి, ఎంఈఓ కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉంగుటూరులో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

గన్నవరం:అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉంగుటూరులో గురువారం ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ నుంచి విద్యార్థులతో కలిసి అధికారులు ప్రదర్శనగా తరలివెళ్లి గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో మానవహారంగా నిలబడి డ్రగ్స్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈ. సత్యకుమార్ మాట్లాడారు. తహసీల్దారు విమాలకుమారి, ఎంఈఓ-2 సాంబశివరావు, ఎస్‌ఐ యు. గోవిందు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్:డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఎస్‌ఐ వి.సురేష్ అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రధాన రహదారుల్లో పోలీస్, రెవిన్యూ, మండల పరిషత్ అధికారులు, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల ఏకరువు

ఉయ్యూరు రూరల్: సమస్యల పరిష్కారమే లక్ష్యం పేరుతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌కు జనం సమస్యలు ఏకరువు పెట్టారు. మండలంలోని బోల్లపాడులో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మూరు సురేష్ రెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలు

తేలప్రోలు(గన్నవరం):ఉంగుటూరు మండలం తేలప్రోలు రైతు సేవా కేంద్రంలో ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి జి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఖరీఫ్ వరి సాగు నిమిత్తం రైతులకు 660 క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 75 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు సరఫరా చేసేందుకు నిల్వ చేసినట్లు తెలిపారు. కేజీ విత్తనాలు పూర్తి ధర రూ. 42 కాగా రైతులు రూ. 5 రాయితీ మినహాయించి రూ. 37 చెల్లించి తీసుకువెళ్లాలని సూచించారు.

ఆరోగ్య సంరక్షణ ప్రదాత ఎల్‌ఎస్‌సీఎస్




డాక్టర్ మహేష్ గుప్తాను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, సజన గోగినేని


గన్నవరం రూరల్:ఆరోగ్య సంరక్షణ ప్రదాత లోయర్ సెగ్మెంట్ సిజేరియన్ సెక్షన్ (ఎల్‌ఎస్‌సీఎస్) అని ప్రముఖ వైద్యుడు, సర్జికల్ ఫ్యాకల్టీ అవార్డు గ్రహీత డాక్టర్ మహేష్ గుప్త తెలిపారు. గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల, రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిపార్టుమెంట్ ఆఫ్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, విజయవాడ అబ్స్టెట్రిక్స్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వైద్య విద్యార్థులకు లైవ్ సర్జికల్ వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మహేష్ గుప్త మాట్లాడుతూ ఎల్‌ఎస్‌సీఎస్ ప్రక్రియ సాధారణమే అయినా ఇన్‌ఫెక్షన్, రక్తస్రావం వంటి ప్రమాదాలను కలిగి ఉంటుందని చెప్పారు. శిశువు ప్రసవ సమయంలో అసాధారణ హృదయ స్పందనలు, కదలికలు తగ్గడం, ఆక్సిజన్ సరఫరా తగ్గడం వంటి బాధల సంకేతాలను అధిగమించి డెలివరి వేగవంతం అయ్యేందుకు, శిశువు భద్రత నిర్ధారించేందుకు ఎల్‌ఎస్‌సీఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ పి.సుధా నాగేశ్వరరావు, డాక్టర్ సీవీరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డాక్టర్ ఎం.త్రిపుర సుందరి, డాక్టర్ సూరపనేని రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీ సీట్లు


పెనమలూరు:జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించి సత్తాచాటిన ఆరుగురు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. ఎన్.తేజశ్రీ, ఆర్.పావణి, షేక్.హఫ్సా, వి.అనూష, కె.నాగనిత్య, ఎల్.ప్రణీతలకు ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో శేషగిరిరావు, పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవీకె సుధారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.



తేజశ్రీ



వి.అనూష



నాగనిత్య



పావని



హఫ్సా



ప్రణీత